
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
మంగళవారం 24 సెప్టెంబరు 2024





కనీసం మెట్లు కూడా లేని గణపతికుంట

చెరువులు ఇలా.. పండుగలు ఎలా?



గుర్రపు డెక్కతో నిండిపోయిన మచ్చవాని కుంట బతుకమ్మ ఘాట్

బొడ్డెమ్మ పండుగ శుక్రవారం నుంచి ప్రారంభంకానుండగా, వచ్చే నెల 2 నుంచి బతుకమ్మ సంబురాలు మొదలు కానున్నాయి. మహిళలు ఉత్సాహంగా బొడ్డెమ్మ, బతుకమ్మ ఆడి చెరువులో నిమజ్జనం చేయనున్నారు. కానీ, సిద్దిపేట పట్టణంలోని కోమటిచెరువు మినహాయిస్తే గణపతికుంట, మచ్చవానికుంట, నర్సాపూర్ చెరువు వద్ద సరైన ఏర్పాట్లు లేవు. గుర్రపు డెక్క, చెత్త చెదారంతో నిండిపోయి ఉన్నాయి. గణపతికుంటలో మెట్లను నిర్మించలేదు. పండుగ సమీపిస్తున్నా అధికారులు ఇంకా ఏర్పాట్లపై దృష్టి సారించలేదు.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పిచ్చి మొక్కలు, చెత్త చెదారంతో నిండిపోయిన నర్సాపూర్ చెరువు

రహదారుల అభివృద్ధికి రూ.60 కోట్లు

- త్వరలోనే రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ, సెప్టెంబరు 23 : నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి రూ.60 కోట్లు మంజూరు అయ్యాయని రాష్ట్ర బీసీ, సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ఎక్కడా రోడ్లు లేని గ్రామం ఉండకూడదని, అదే తన లక్ష్యమన్నారు. కోహెడ మండలంలో సోమవారం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే రేషన్‌కార్డులు, ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం రుణమాఫీ అమలు చేసిందని ఎవరికైనా రాకపోతే ఏఈవోలను కలిసి సమాచారం ఇవ్వాలన్నారు. నియోజకవర్గాన్ని ఇచ్చిన మాట ప్రకారం ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

శనిగరం ప్రాజెక్టు సందర్శనం

మంత్రి కోహెడ మండలంలోని శనిగరం ప్రాజెక్టును సందర్శించి గంగమ్మకి పసుపు, కుంకుమ పూలు వేసి పూజలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు బీసీ హాస్టల్‌కు వరద వచ్చిందని మంత్రి దృష్టికి గ్రామస్థులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన హాస్టల్‌ను పరిశీలించారు. గుట్ట నుంచి వచ్చే వరద నీటిని మురుగు కాలువకు కలిపి వరద నీరును పంపించాలని అధికారులను ఆయన ఆదేశించారు. విద్యార్థులకు అందుతున్న ఆహారం, హాస్టల్‌లో ఉన్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. నీటి సౌకర్యం కోసం బోర్ కావాలని, మూత్రశాలలు, మరుగుదొడ్ల ఇబ్బంది ఉందని సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. తంగళ్లపల్లి గ్రామంలో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు, విద్యుత్ స్తంభాలు మార్పునకు ఇప్పటికే రూ.5.60 లక్షలు మంజూరు చేసినప్పటికీ పనుల ఆలస్యంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా పోల్స్ వేసి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కోహెడ మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయంలో ప్రజా సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. కొన్ని సమస్యలు వెంటనే అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడే పరిష్కరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కోహెడ పోచమ్మ వీధిలో కూలిన మురుగు కాలువను ఆయన పరిశీలించారు. శాశ్వత పరిష్కారానికి కాలువలను వెడల్పుగా మార్చి త్వరితగతిన పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, ముఖ్య నేతలు బస్వరాజు శంకర్, దొమ్మాట జగన్‌రెడ్డి, బందెల బాలకిషన్, కర్ర రవీందర్, పాము శ్రీకాంత్, నారాయణగౌడ్, తిరుపతి, లక్ష్మణ్ ఉన్నారు.



కోహెడ మండలం శనిగరం ప్రాజెక్టు వద్ద పూజలు చేస్తున్న మంత్రి

రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు

హుస్నాబాద్, సెప్టెంబరు 23 : హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి పంచాయతీ రాజ్ ఎంఆర్ఆర్ కింద రూ.10 కోట్లు, పంచాయతీ రాజ్ సీఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.50 కోట్లు మంజూరయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో వివరించారు. హుస్నాబాద్ నుంచి మడత ఉల్లంపల్లి బీటీ రెనివల్‌కు రూ.1.70 కోట్లు, హుస్నాబాద్ మండలం నాగారం ఉమ్మాపూర్ మీదుగా మహ్మదాపూర్ రోడ్డుకు రూ.2.77 కోట్లు, హుస్నాబాద్ మండలం అంబయ్యపల్లి, బంజేరుపల్లి మీదుగా పందిల్ల రోడ్డుకు రూ.2.47 కోట్లు, హుస్నాబాద్ మండలం పొట్లపల్లి నుంచి పర్వేద రోడ్డుకు రూ.2.7 కోట్లు, కోహెడ మండలం బస్వాపూర్ వయా ధర్మసాగర్‌పల్లి మోతిరాం తండా చంద్రానాయక్ తండా బీటీ రోడ్డు రెనివల్‌కు రూ.2.81 కోట్లు, కోహెడ మండలం గొట్లమిట్ట, నారాయణపూర్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.91.55 లక్షలు, కోహెడ, షైసంపల్లి సీడీ పనులకు రూ.77 లక్షలతో పాటు నియోజకవర్గంలోని చిగురుమామిడి, ఎల్కతుర్తి, సైదాపూర్, భీమదేవరపల్లి మండలాల్లోని బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఇతర పనులకు రెండో విడతలో నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఒకేసారి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడంపై నియోజకవర్గ ప్రజలు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ఆకట్టుకుంటున్న మహాలక్ష్మి సిలిండర్

సిద్దిపేట కలెక్టరేట్, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మహాలక్ష్మి సిలిండర్ నమూనాను అధికారులు ఏర్పాటు చేశారు. సోమవారం ప్రజావాణికి వచ్చిన పలువురు మహిళలు, ప్రజలు ఈ నమూనాను ఆసక్తిగా తిలకించారు.

- సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 23

సాగులో సాంకేతికత

- డ్రోన్‌తో పంటలకు ఎరువుల స్ప్రే..
- సమయం, ఖర్చు ఆదా

7



మాకు రుణమాఫీ ఏదీ?



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 23 : సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన 80 మంది రైతులు తమకు పంట రుణమాఫీ కాలేదని కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమనానికి కొంతమందినే పోలీసులు అనుమతించడంతో వారంతా కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేసి నిరసన తెలిపారు. పోలీసులు వారికి సముదాయించి లోపలికి పంపించారు. ప్రజావాణికి కలెక్టర్, అదనపు కలెక్టర్ హాజరుకాకపోవడంతో అసంతృప్తికి లోనైన రైతులు డీఆర్డీఏ పీడీకి వినతిపత్రం అందజేశారు. తమకు రుణమాఫీ జరిగేలా చూడాలని రైతులు డీఆర్డీఏ పీడీని వేడుకున్నారు.

ప్రజావాణికి 81 ఫిర్యాదులు

- అర్జీలను త్వరగా పరిష్కరించాలి
- డీఆర్వో నాగరాజమ్మ

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 23 : కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 81 దరఖాస్తులు వచ్చాయి. డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జగదేవ్ ఆర్య అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో నాగరాజమ్మ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి దోహదపడుతుందన్నారు. ప్రజావాణి కార్యక్రమంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని, ఎంతో నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలను విన్నవించుకోవడానికి పరిష్కారానికి ప్రజావాణికి వస్తారన్నారు. అర్జీదార్ల సమస్యలను వెంటనే పరిష్కరించి, న్యాయం చేయాలని జిల్లా అధికారులకు ఆమె సూచించారు. సదరం సర్టిఫికెట్ వచ్చి సంవత్సరంపైగానే అవుతున్న పింఛన్ రావడంలేదని దివ్యాంగుడు రమేష్ ప్రజావాణిలో డీఆర్డీఏ పీడీ జగదేవ్ ఆర్యకు విన్నవించుకున్నారు. పింఛన్ మంజూరు చేయాలని ఆయనను వేడుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పింఛను వచ్చేలా చేస్తానని పీడీ హామీ ఇచ్చారు.



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో నాగరాజమ్మ

కోట్ల విలువ చేసే భూములు లాక్కొన్నారు

- సరైన పరిహారం ఇవ్వకుండా రోడ్డున పడేశారు
- స్పందించకుంటే ఆత్మహత్యలు చేసుకుంటాం



టీజీఐఐసీ భూముల్లో పరిశ్రమల నిర్మాణల వద్ద ఆందోళన చేస్తున్న భూనిర్వాసితులు

వర్గల్, సెప్టెంబరు 23 : కోట్ల విలువ చేసే భూములకు నామమాత్ర పరిహారం ముట్టజెప్పి బలవంతంగా లాక్కొన్నారని, రికార్డు ప్రకారం ఉన్న భూములకు సైతం సరైన పరిహారం ఇవ్వకుండా రోడ్డున పడేశారని భూనిర్వాసితులు సోమవారం నిర్మాణంలో ఉన్న పరిశ్రమల వద్ద ఆందోళన చేపట్టారు. వర్గల్ మండల కేంద్రంలో సర్వే నంబరు 1495, 1510లో ఉన్న భూములను పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం రైతుల వద్ద నుంచి తీసుకుని టీజీఐఐసీకి అప్పగించిన విషయం తెలిసిందే. టీజీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులు నిర్మాణంలో ఉన్న పరిశ్రమల వద్ద పనులను అడ్డుకుని తమకు అన్యాయం జరిగిందని నినదించారు. భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి ఇంటి సర్టిఫికెట్లు మాత్రమే ఇచ్చారని, ఇప్పటివరకు స్థలం చూపలేదని మండిపడ్డారు. తమకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే పోరాటం కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే తమ భూముల వద్ద ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్, రెవెన్యూ అధికారులు న్యాయం చేయ్యాలని, అంతవరకు పరిశ్రమల వద్ద నిర్మాణాలను జరగనివ్వబోమన్నారు. ఈ కార్యక్రమంలో వర్గల్ గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు సుమారు 100 మంది వరకు పాల్గొన్నారు.



సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న జలాలు

సింగూరుకు జల పరవళ్లు

- మళ్లీ పోటెత్తిన వరద.. నిండుకుండలా జలాశయం
- గరిష్ఠ నీటిమట్టానికి చేరుకున్న ప్రాజెక్టు
- ప్రస్తుతం 29.708 టీఎంసీల నీరు నిల్వ
- కొనసాగుతున్న జల విద్యుదుత్పత్తి

పుల్‌కల్, సెప్టెంబరు 23 : సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు మళ్లీ వరద పోటెత్తింది. రెండు రోజులుగా ప్రాజెక్టుకు ఎగువన గల మంజీర నది క్యాచ్‌మెంట్ ఏరియాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వరద నీరు వస్తున్నదని నీటి పారుదల శాఖ డీఈఈ నాగరాజు, జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెలారంభంలో ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టానికి చేరుకోవడంతో ఐదో తేదీన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదిలిన విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం అర్ధరాత్రి నుంచి సింగూరు ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం పెరిగింది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 11,656 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు 11వ నంబరు క్రస్ట్ గేట్‌ను మీటరున్నర ఎత్తి 8,142 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నారు. జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వారా 2,823 క్యూసెక్కుల వరద దిగువకు విడుదలవుతోంది. సోమవారం రాత్రి అందిన సమాచారం మేరకు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 523.600 మీటర్లు కాగా, ప్రస్తుతం 523.565 మీటర్ల నీటిమట్టానికి చేరుకున్నది.

5.86 మిలియన్ యూనిట్ల జల విద్యుదుత్పత్తి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సింగూరు ప్రాజెక్టు నీటి ద్వారా 5.86 మిలియన్ యూనిట్ల జల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని మినీ హైడల్ స్టేషన్స్ జెన్‌కో పోచంపాడ చీఫ్ ఇంజనీర్ వీ.రమేశ్‌బాబు తెలిపారు. సింగూరు ప్రాజెక్టు జల విద్యుదుత్పత్తి కేంద్రంలో రెండు టర్బైయిన్లు చురుకుగా పనిచేస్తున్నాయని, రోజుకు 0.36 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్ సదాశివపేట, జోగిపేట ప్రాంతాల్లోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు సరఫరా చేస్తున్నామన్నారు.

ప్రాజెక్టు సామర్థ్యం	29.917 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	29.708 టీఎంసీలు
ఇన్‌ఫ్లో నమోదు	11.656 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	10.965 క్యూసెక్కులు
జల విద్యుదుత్పత్తి	0.36 మిలియన్ యూనిట్లు(రోజుకు)


ఉద్దేశపూర్వకంగానే సునీతారెడ్డి ఇంటిపై దాడి

- గోమారం ఘటనకు బాధ్యత ప్రభుత్వానిదే : హరీశ్‌రావు

నర్సాపూర్/శివ్వంపేట, సెప్టెంబరు 23: ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటిపై ఉద్దేశపూర్వకంగానే దాడి జరిగిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మండలంలోని శివ్వంపేటలో ఆదివారం అర్ధరాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా ఎమ్మెల్యే ఇంటి ఎదుట టపాసులు కాల్చే విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో సోమవారం హరీశ్‌రావు.. సునీతారెడ్డిని పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంట్లో లేని సమయంలో అర్ధరాత్రి కావాలని నిమజ్జన యాత్రను ఆమె ఇంటి వైపు తీసుకువచ్చి గొడవ చేశారని ఆరోపించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులపైనా దాడి చేయడం రాక్షస పాలనను తలపిస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతోనే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా టపాసులు కాలిస్తే అభ్యంతరం లేదని, తన ఇంటి వద్ద రచ్చ చేయాలనే ఉద్దేశంతోనే ప్రణాళిక ప్రకారం దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు.



వివరాలు తెలుసుకుంటున్న హరీశ్‌రావు



సిర్గాపూర్‌లో యువకుడు అదృశ్యం


శేఖర్ (ఫైల్)

కల్హేర్, సెప్టెంబరు 23: యువకుడు అదృశ్యమైన సంఘటన సిర్గాపూర్‌లో మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం సిర్గాపూర్‌కు చెందిన శేఖర్‌కు మద్యం అలవాటు ఉన్నంది. గత 15 రోజులుగా మద్యం మానివేయ డంతో పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున ఇంట్లో ఎవరికి చెప్ప కుండా బయటికెళ్లిన అతను తిరిగి రాలేదు. బంధువులు, చుట్టుపక్కలవారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో నుంచి వెళ్లేటపుడు శేఖర్ నీలి రంగు షర్టు, నల్ల ప్యాంటు ధరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శేఖర్ సోదరుడు విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మికుల నిరసన

నారాయణఖేడ్, సెప్టెంబరు 23: కార్మికులకు వ్యతిరేకంగా ఉన్ననాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం ఖేడ్ స్వామివివేకానంద విగ్రహ వద్ద కార్మికులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కనీస వేతనాలు, పని గంటలు, బోనస్, ప్రమాదాలకు నష్టపరిహారం తదితర 44 చట్టాలను కేంద్రప్రభుత్వం రద్దుచేసి నాలుగు కోడ్‌లుగా పార్లమెంట్‌లో ఆమోదించిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ యాజమాన్యాలకు తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏసు, రాజు, సాయమ్మ, లక్ష్మి, శకుంతల, సిద్దమ్మ పాల్గొన్నారు.


ఖేడ్‌లో నిరసన తెలుపుతున్నకార్మికులు

సర్వీసు రోడ్డు.. సంగతేంటి?

- ఓఆర్ఆర్ పూర్తి అయి 15 ఏళ్లు..
- ఇంకా అందుబాటులోకి రాని సర్వీసు రోడ్డు
- అడ్డంకిగా రైల్వే ఓవర్ బ్రిడ్జి
- రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం
- ఇంకా నత్త నడకే.. అవి పూర్తయితేనే రోడ్డు..


అసంపూర్తిగా ఉన్న రైల్వే బ్రిడ్జి

రామచంద్రాపురం, సెప్టెంబరు 13: అది పదిహేనేళ్ల నాటి నుంచి నానుతున్న సమస్య. రైల్వే బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బందులు తప్పుతాయని భావించినా.. పనులు ముందుకు సాగకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ తన సామగ్రి తరలించేందుకు వేసుకున్న తాత్కాలిక ర్యాంపుపై ప్రమాదకరంగా ప్రయణిస్తున్నారు. సుమారు 18 ఏళ్ల క్రితం ఓఆర్ఆర్ పనులు ప్రారంభం కాగా, దాని వెంట గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు సర్వీసు రోడ్డునూ వేసిన విషయం తెలిసిందే. అయితే, రామచంద్రాపురం పరిధి ఈదులనాగుపల్లి-వెలిమెల గ్రామాల శివారులో రైల్వే లైన్ ఉండటంతో అక్కడ సర్వీసు రోడ్డు పనులు ముందుకు సాగలేదు. రైల్వే లైన్‌పై బ్రిడ్జి నిర్మించిన తర్వాత సర్వీస్ రోడ్డు వేయాల్సి ఉంది. ఈ ప్రాంతంలో సర్వీసు రోడ్డు పనులు ఆపేసి ట్రాక్ దాటిన తర్వాత ముత్తంగివైపు సర్వీసు రోడ్డును కొనసాగించారు. అదే సయంలో ఓఆర్ఆర్ కాంట్రాక్ట్ పనులు చేపట్టిన సంస్థ తమ సామగ్రిని తరలించేందుకు ఈ గ్రామాల మధ్య సర్వీస్ రోడ్డు వదిలేసిన ప్రాంతంలో ఓ ర్యాంపు (మట్టి రోడ్డు) వేసింది.

అదే దారి..

తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ర్యాంపు ఇప్పుడు వెలిమెల గ్రామస్థులకు రహదారిగా మారింది. అయితే, ఓఆర్ఆర్ పనులు పూర్తయిన తర్వాత కాంట్రాక్ట్ సంస్థ ఆ ర్యాంపును తొలగించేందుకు సిద్ధపడగా.. తమ గ్రామస్థులకు ఇబ్బందులు తప్పవని స్థానికంగా ఆందోళన వ్యక్తమైంది. రైల్వే బ్రిడ్జి పనులు పూర్తై, సర్వీసు రోడ్డు పనులు కూడా పూర్తయిన తర్వాత ర్యాంపు తలగించాలని అప్పటి సర్పంచ్ రాజ్యం మహిపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ర్యాంపు తొలగించకుండా అడ్డుకున్నారు. హెచ్ఎండీఏ ఈ ర్యాంపును తొలగించేందుకు సిద్ధపడగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ర్యాంపుపై తన సొంత నిధులతో సీసీ వేయడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు ఆయన పనులకు శ్రీకారం చుడుతూ కొబ్బరికాయ కూడా కొట్టారు. అయితే, అనుమతి లేకుండా పనులు చేయడాన్ని హెచ్ఎండీఏ ఆక్షేపించడంతో పనులు ఆగిపోయాయి. అయితే, సమస్య తీవ్రతను గుర్తించిన ఎంపీ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించగా, రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం అయ్యాయి. అయితే, ఆ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. పనులు జాప్యం జరుగుతుండటంతో ఇప్పటికీ ప్రజలు సదరు ర్యాంపుపైనా ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు.


ప్రమాదకరంగా మారిన ర్యాంపు రోడ్డుపై వాహనాల రాకపోకలు

పనులు పూర్తి చేయాలి : రాజ్యం మహిపాల్ గౌడ్, మాజీ సర్పంచ్



ఓఆర్ఆర్ ఏర్పాటై 15 ఏళ్లు కావుస్తున్నా.. వెలిమెల వద్ద సర్వీసు రోడ్డు అందుబాటులోకి రాలేదు. దీంతో వెలిమెల, వెలిమెల తండ, సందుగూడెం, కొండకల్, పాటి, కర్ధనూరు, ఘనపూర్ గ్రామాల ప్రజలు ఓఆర్ఆర్ పైకి వెళ్లేందుకు, దిగేందుకు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వాలు స్పందించి ఇక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, సర్వీసు రోడ్డు పనులు చేపట్టాలి. ఈ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి.



వెలివేతకు గురైన కుటుంబానికి భరోసా

- హైకోర్టు ఆదేశాలతో కదిలిన అధికారులు
- గ్రామస్థులకు కలెక్టర్, ఎస్పీ అవగాహన సదస్సు
- కలిసి ఉండాలని హితవు


గౌతోజీగూడెం గ్రామంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మనోహరాబాద్, సెప్టెంబరు 23 : గ్రామస్థులు సామాజిక బహిష్కరణ చేసిన కుటుంబానికి అధికారులు అండగా నిలిచారు. మండలంలోని గౌతోజీగూడ గ్రామానికి చెందిన పంచమి నర్సమ్మ, ఆమె కుమారులు అర్జున్, చంద్రంలు తమను సామాజిక బహిష్కరణకు గురి చేశారంటూ ఈ నెల 11న జిల్లా ఎస్పీకి ఎక్స్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని పంచమి చంద్రం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతోపాటు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కార్యాలయంలో, మానవ హక్కుల కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో హైకోర్టు వెలివేతకు గురైన కుటుంబానికి రక్షణ కల్పించాలని ఈ నెల 20న కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో సోమవారం కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్, ఆర్డీవో జయచంద్రారెడ్డి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక చర్యలకు పూనుకుంటే సహించేది లేదన్నారు. వెలివేత తప్పని, ఇలాంటి చర్యలు మళ్లీ జరగవద్దని హెచ్చరించారు. అంతా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఎస్పీ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామస్థులంతా ఒక్క కుటుంబంగా ఉండాలని సూచించారు. కొందరిపై కక్షసాధింపు ధోరణి తగదన్నారు. ఇద్దరు అధికారులు గ్రామస్థులతో మాట్లాడి సామరస్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో శశికళ, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డీటీ కౌశిక, ఎస్ సుభాష్‌గౌడ్, మండల ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రూ.3.50 లక్షలకు కంది తైబజార్ వేలం


తైబజార్ వేలం నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీ శ్రీనివాస్


కంది, సెప్టెంబరు 23 : మండలకేంద్రమైన కందిలోని తైబజార్‌కు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి, ఎంపీడీవో శ్రీనివాస్ వేలంపాట నిర్వహించారు. వచ్చే సంవత్సరం మార్చి 31వ తేదీవరకు 6 నెలల వ్యవధికి మాత్రమే తైబజార్ వేలం వేశారు. గ్రామానికి చెందిన పది మంది ఈ వేలంలో పాల్గొనగా.. చాంద్‌పాష అనే వ్యక్తి రూ.మూడున్నర లక్షలకు కైవసం చేసుకున్నారు. వేలంలో వచ్చిన ఈ డబ్బును గ్రామ అభివృద్ధికి ఖర్చు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్ రెడ్డి, కార్యదర్శి విద్యాధర్, బిల్ కలెక్టర్లు మల్లేశం, వీర్రాజు, సతీష్, కిరణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ కోసం స్థల పరిశీలన


మోడల్ డిగ్రీకళాశాల ఎదుట స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు


నారాయణఖేడ్, సెప్టెంబరు 23: ఖేడ్ పట్టణ శివార్లలోని మోడల్ డిగ్రీ కళాశాల ఎదుట ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశాల మేరకు బస్ షెల్టర్ నిర్మించనున్నారు. అందుకోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు సోమవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, పీఆర్వో పాండు, దాత తానాజీ తదితరులు పర్యటించారు. పట్టణం నుంచి డిగ్రీ కళాశాల నాలుగు కిలో మీటర్ల దూరం ఉండటంతో విద్యార్థులు కోరిన మేరకు ఎమ్మెల్యే రిక్వెస్ట్ స్టాప్‌ను ఏర్పాటు చేయించారు. బస్ షెల్టర్ ఏర్పాటుకు సైతం ఆయన హామీనివ్వగా పట్టణానికి చెందిన వ్యాపార వేత్త తానాజీ దాతగా ఖర్చును సమకూర్చేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు కళాశాల ఎదుట స్థలాన్ని ఖరారు చేయగా త్వరలోనే నిర్మిస్తామని దాత తెలిపారు.

20 లీటర్ల గోవా మద్యం పట్టివేత


గోవామద్యాన్ని పట్టుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

జహీరాబాద్, సెప్టెంబరు 23 : మహారాష్ట్రలోని గోవా నుంచి హైదరాబాద్‌కు ట్రావెల్స్ బస్సుల్లో అక్రమంగా తీసుకువస్తున్న 20 లీటర్ల మద్యాన్ని ఎక్సైజ్ఎన్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిరాగ్‌పల్లివద్ద గల ఎక్సైజ్ చెక్‌పోస్టువద్ద సోమవారం ఉదయం తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని గోవా నుంచి తెలంగాణకు వస్తున్న టూరిస్టు బస్సులను తనఖీలు చేయగా అందులో 20లీటర్ల నిషేధిత అక్రమమద్యం లభించింది. ఈ మేరకు మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనఖీల్లో సీఐలు చంద్రశేఖర్, మల్లిఖార్జున్, ఎస్ఐలు హన్మంతు, రమేష్, ఇబ్రహీం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలి

● తహసీలార్‌కు పూర్వ వీఆర్‌ఏల వినతి


వినతిపత్రం అందజేస్తున్న పూర్వ వీఆర్ఏలు

శివ్వంపేట, సెప్టెంబరు 23: గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జీవో నెం.81, 85, 98 వలన ప్రమోషన్ పొందిన 55 నుంచి 61 వయస్సు వీఆర్ఏలు రోడ్డున పడ్డాయని సదరు వ్యక్తులు ఆవేదనం వ్యక్తం చేశారు. తక్కువ సర్వీస్ చేసి, ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేకుండానే పదవీ విరమణ పొందుతూ ఉన్న ఇక్క ఆర్థిక వనరు కోల్పోతున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు 600 మంది రిటైర్మెంట్ అయ్యారని, ఇంకా ఇతర సమస్యలతో కూడా బాధపడుతున్నామన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తమకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని వారు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంతోకాలంగా గ్రామాల్లో చేస్తున్న వెట్టి చాకిరిని గుర్తించి తమ వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించే విధంగా చేసి న్యాయం చేయాలని కోరారు.




రాంపూరు పరిధిలో కొండల నుంచి తీసిన రాతి కడీలు


ట్రాక్టర్‌లో తరలిస్తున్న రాతి కడీలు


ప్రభుత్వ భూమిలో బండలను పగులగొడుతున్న కూలీలు

కొండలు పిండి.. గుట్టలు గుల్ల..

ఇష్టారాజ్యంగా ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులు

- రాంపూర్‌లో యథేచ్ఛగా అక్రమ మైనింగ్
- కోహీర్ మండలంలో ఎర్రమట్టి తవ్వకాలు
- కనుమరుగవుతున్న కొండలు, గుట్టలు
- వాల్టా చట్టానికి తూట్లు.. పట్టించుకోని అధికారులు

అల్లాదుర్గం, సెప్టెంబరు 22 : ప్రకృతి సంపదను పరిరక్షించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వాల్టా చట్టాన్ని కొందరు చుట్టంగా చేసుకుని అక్రమార్కులకు పాల్పడుతున్నారు మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కొందరు మైనింగ్ వ్యాపారులు రాజకీయ పలుకుబడితో యథేచ్ఛగా ప్రభుత్వ భూమిలోని రాతి కొండలను కొల్లగొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

అంతరించిపోతున్న కొండలు..

రాంపూర్ గ్రామ శివారులో పుష్కలంగా ఉన్న రాతి కొండలు మైనింగ్ వ్యాపారులకు ఓ వరంగా మారాయి. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ రాతి కొండలను ధ్వంసం చేసి పునాది రాళ్లు, కడీలుగా మార్చుతూ విక్రయిస్తున్నారు. గజ్వేల్, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన కొందరు కూలీలను రప్పించి అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సౌకర్యం లేనిచోట్ల జనరేటర్లు, అధునాతన పరికరాలను వినియోగిస్తూ కొండలను పిండిచేస్తున్నారు. దీంతో గుట్టలు, కొండలు రోజు రోజుకూ అంతరించిపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలు మార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఇటు వైపు కన్నెత్తి కూడా చూడక పోవడం పలు అనుమానాలకు తావిస్తుందని ప్రజలు వాపోతున్నారు.

దర్గాగా పట్టణ ప్రాంతాలకు రవాణా..

అక్రమంగా కొనసాగిస్తున్న రాతీ కడీలను ట్రాక్టర్లలో దర్గాగా పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అల్లాదుర్గంలోని తహసీల్దార్ కార్యాలయం కూత వేటు దూరంలోని 161వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు మీదుగా సంగారెడ్డి, జహీరాబాద్ తదితర పట్టణ ప్రాంతాలకు నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకుని ప్రకృతి సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


చింతలఘట్టు గ్రామ పరిధిలో మట్టి తవ్వకాలతో కనుమరుగైన గుట్ట


తరలుతున్న మట్టి

దర్గాగా ఎర్రమట్టి తవ్వకం..

కోహీర్, సెప్టెంబరు 22 : మండలంలోని పెద్ద పెద్ద గుట్టలు, కొండలు అక్రమార్కుల చేతివాటంతో కనుమరుగవుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఎర్రమట్టిని తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని చింతలఘట్టు, దిగ్వాల్, మద్రి గ్రామ పరిధిలో జోరుగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా చింతలఘట్టు గ్రామ పరిధిలోని చాలావరకు గుట్టలు ఇప్పటికే కరిగిపోయాయి. గతంలో ఈ గుట్టల తవ్వకాల్లో ఓ వ్యక్తిపై పెద్ద బండరాయి మీద పడి చనిపోయినా అక్రమార్కులు నిర్భయంగా తవ్వకాలు చేపడుతున్నారు. అధికారులు సైతం మిన్నకుండిపోవడంతో పగలు, రాత్రి అనే తేడాలేకుండా ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల సాక్షాత్తు కలెక్టర్ సంబంధిత రెవెన్యూ అధికారులకు ఆదేశించినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల కొత్తూరు(డి) గ్రామానికి చెందిన రెండు టిప్పర్లను సీజ్ చేసి నామమాత్రం ఫైన్ విధించి వదిలేయడం పలు విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికైనా ఎర్ర మట్టి అక్రమ తవ్వకాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గుట్టలను కాపాడాలి..



పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టిని అక్రమంగా తరిస్తున్నవారిపై చర్యలు తీసుకుని గుట్టలను కాపాడాలి. అసైన్డ్, పట్టా భూములనే తేడా లేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో పంట పొలాలు పాడవుతున్నాయి.

-తహేసిమ్, దిగ్వాల్ వాసి

అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవు



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు ఎవరికి కూడా మేము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఎక్కడపడితే అక్కడ నుంచి మట్టిని తరలిస్తే ఎక్స్‌వేటర్లు, టిప్పర్లను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తాం.

-బాలశంకర్, తహసీల్దార్

సాగులో సాంకేతికత

- డ్రోన్‌తో పంటలకు ఎరువుల స్ప్రే..
- సమయం, ఖర్చు ఆదా

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 23 : పంటల సాగులో రోజురోజుకూ ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకుంటున్నారు. పంటల్లో చీడపీడల నివారణ, మొక్కల పెరుగదుల తదితరవాటికి ఉపయోగించే ఎరువులు, క్రిమి సంహారక మందులను డ్రోన్ సాయంతో స్ప్రే చేస్తూ సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. శ్రీ బుగ్గ రాజారాజేశ్వర రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం (ఎఫ్‌పీవో) నారాయణరావుపేట పరిధిలోని గ్రామాల రైతుల సౌకర్యార్థం డ్రోన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో సుమారు 700 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వారంతా పంటలకు నానో యూరియా, నానో డీఏపీ, పొటాష్‌తో పాటు క్రిమిసంహారక మందులు ఈ డ్రోన్ తోనే స్ప్రే చేస్తున్నారు.

శ్రమ లేకుండా..

మండలంలోని ఆయా గ్రామాల్లో వరితో పాటు పత్తి పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరం పంట పొలంలో ఎలాంటి శ్రమ లేకుండా కేవలం పది నిమిషాల్లో నానో లిక్విడ్, క్రిమిసంహారక మందులను డ్రోన్ స్ప్రే చేస్తుంది. దీనికి గాను కేవలం రూ.450 మాత్రమే ఖర్చు అవుతుంది. అదే రైతులే ఎరువులు, మందులు చల్లాలంటే శ్రమతోపాటు చాలా సమయం పడుతుంది. కూలీలను పెట్టించి చల్లినా ఆర్థిక భారం తప్పదు. అంతేకాకుండా డ్రోన్ వాడకంతో పంటల దిగుబడి సైతం అధికంగా వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రైవేటు డ్రోన్‌తో అయితే ఎకరాకు రూ.550 వరకు వసూలు చేస్తుండగా.. ఎఫ్‌పీవోలోని రైతులకు మాత్రం రూ.450 తీసుకుంటున్నారు.


డ్రోన్ సహకరంతో మందులు స్ప్రే చేస్తున్న రైతులు

సులభంగా మందుల స్ప్రే..

ఎఫ్‌పీవోలో రైతులకు డ్రోన్ అందుబాటులో ఉంచడం సంతోషంగా ఉంది. తక్కువ ఖర్చు.. తక్కువ సమయంలో ఎరువులు, క్రిమిసంహారక మందులు సులభంగా స్ప్రే చేసుకోవచ్చు. భవిష్యత్తులో మరిన్ని సాంకేతిక పనిముట్లను అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం సహకారం అందించాలి.

-గుర్రం లింగారెడ్డి, రైతు, నారాయణరావుపేట

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు క్రీడాకారుల ఎంపిక


ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఎం.ఎస్.అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు సోమవారం ఎంపికలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 105 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఉమ్మడి జిల్లా జట్టుకు 16 మందిని ఎంపిక చేశా. వారిలో రాహుల్ నాయక్, హిశాంత్, రుత్విక్‌రెళ్ల, దీక్షిత్, యోగేశ్వర్‌సింగ్, విక్రమ్ రాథోడ్, అంజి, సిరిల్‌డాల్సన్, మనిషత్విక్, గణేష్, పాండు, నెవిస్‌మానిత్, ప్రణీత్‌రెడ్డి, స్టాలిన్, అక్షయ్‌కుమార్, హరీష్‌గౌడ్ ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 వ తేదీ నుంచి ప్రారంభయ్యే అండర్-19 ఇంటర్‌డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఎ.రాజేందర్‌రెడ్డి తెలిపారు.



విద్యార్థులకు భూసార పరీక్ష నమూనా సేకరణపై అవగాహన కల్పిస్తున్న డీఏవో రాధిక, శాస్త్రవేత్తలు

భూసార పరీక్షతో అధిక దిగుబడి

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక


చిన్నకోడూరు, సెప్టెంబరు 23 : పంట దిగుబడిలో భూసార పరీక్ష ముఖ్యపాత్ర పోషిస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక అన్నారు. సోమవారం మండలంలోని గోనెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్ష నమూనా సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భూసార పరీక్షతో భూమిలోని పోషకాలు తెలుసుకుని అందుకనుగుణంగా పంటలు, ఎరువులు వాడితే మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీజయ, ఏడీఏ పద్మ, శాస్త్రవేత్తలు డాక్టర్ రమాదేవి , డాక్టర్ ఉమారాణి , డాక్టర్ శ్వేత, డాక్టర్ సరిత, డాక్టర్ పల్లవి, ఏవో జయంత్ కుమార్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ నీటితో పంటల సాగుపై శిక్షణ ఇవ్వాలి

కుకునూరుపల్లి, సెప్టెంబరు 23: తక్కువ నీటితో పంటల సాగుపై రైతులకు శిక్షణ ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక అధికారులకు సూచించారు. సోమవారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సౌజన్యంతో నీరు, నేల యాజమాన్య శిక్షణ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి సంరక్షణ పద్ధతులపై వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. నెట్ ఆఫ్ ఇరిగేషన్ లిమిటెడ్ డీజీఎంఏ సుబ్బారావు మాట్లాడుతూ బిందు, తుంపర సేద్యంపై అవగాహన కల్పించారు. శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సింధుజ పూలు, కూరగాయల సాగుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వాలాంతరి, సహాయ వ్యవసాయ అధికారి సునిత, అన్నపూర్ణ, కుకునూరుపల్లి వ్యవసాయ అధికారి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు

మెదక్‌లో కారు బీభత్సం.. బైకులు ధ్వంసం

● మహిళకు తీవ్ర గాయాలు


ప్రమాదానికి కారణమైన కారు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 23: మెదక్ పట్టణంలో ఆదివారం రాత్రి కారు అదుపు తప్పి అతివేగంగా ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద ఫుట్‌పాత్‌పైకి దూసుకువచ్చి బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఆసుపత్రిలో పని చేస్తున్న పోచమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. అంతేకుండా కారు హాస్పిటల్ ఎదుట పార్కింగ్ చేసిన మూడు బైకులను ఢీకొట్టగా ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పట్టణ సీఐ నాగరాజు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించారు. ప్రమాదానికి నిద్రమత్తే కారణమని భావిస్తున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలి

● తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 23: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలశాఖ ఆధ్వర్యంలో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. 317 బాధిత ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 23 : గతంలో గ్రామాల్లోని పలు అభివృద్ధి చేపట్టిన బిల్లులను చెల్లించాలని మాజీ సర్పంచ్ జ్యోతి ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులను విడుదల చేయకపోవడం బాధాకరం అన్నారు.

బొల్లారంలో గంజాయి పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

జిన్నారం, సెప్టెంబరు 23: బొల్లారం మున్సిపాలిటీలో గంజాయి పట్టుబడింది. పోలీసుల కథనం ప్రకారం సోమవారం రాత్రి 9 గంటలకు మున్సిపాలిటీలోని వైఎస్ఆర్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు జరిపారు. కాగా, ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరు మహిళల నుంచి 9.8 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

అర్హులైన ప్రతీ విద్యార్థికి గురుకులంలో సీటు

● ఉమ్మడి మెదక్ జిల్లా ఎంజేపీ ఆర్‌సీవో సంతోషి


తునికిలోని గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న అధికారి

కౌడిపల్లి, సెప్టెంబరు 23: ఉమ్మడి మెదక్ జిల్లాలోని 5 నుంచి 8 తరగతులకు చెందిన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల (ఎంజేపీ)లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి సోమవారం విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌడిపల్లి మండలంలోని తునికి గురుకుల పాఠశాలలో జరిగి ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో సంతోషి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ మెరిట్ ప్రకారం భర్తీ చేయగా మిగిలి సీట్లను కేటగిరిల వారీగా భర్తీ చేస్తునట్లు ఆమె తెలిపారు. అర్హులైన ప్రతి విద్యార్థికి గురుకుల పాఠశాలలో సీట్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కన్వీనర్ శివప్రసాద్, మెదక్ జిల్లా కన్వీనర్ హరిబాబు వివిధ గురుకుల పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాల్‌లు ఉన్నారు.

ఎస్టీయూ జిల్లా కన్వీనర్‌గా వినయ్ కుమార్

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 23: చిన్నశంకరంపేట హైస్కూల్ ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్ ఎస్టీయూ జిల్లా నమస్తే ఉపాధ్యాయ మాస పత్రిక జిల్లా కన్వీనర్‌గా నియమాకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంరతం పోరాడుతమన్నారు. అనంతరం ఆయను సన్మానించారు.


వినయ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భర్త వేధింపులు.. భార్య బలవన్మరణం


జనాబాయి(ఫైల్)

కల్హేర్, సెప్టెంబరు 23; భర్త వేధింపులు తాళలేక భార్య బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిర్గాపూర్ మండలంలోని కిషన్‌తండాకు చెందిన నాందేవ్ నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి అనుమానిస్తూ భార్య జనాబాయి(35)ను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో మూడు మాసాల కింద జనాబాయి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా.. పెద్దల పంచాయితీ నిర్వహించి కలిసి ఉండాలని చెపారు. అయినా నాందేవ్‌లో మార్పు రాకపోగా తిరిగి భార్యను వేధిస్తున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చేసిన జనాబాయి ఆదివారం సాయంత్రం పొలం వద్ద వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి రాథోడ్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాందేవ్‌పై కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

భార్యతో గొడవపడి భర్త..


గణేష్ (ఫైల్)

తూప్రాన్, సెప్టెంబరు 23: భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ మండలం నర్సంపల్లిలో చోటుచేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం గ్రామానికి చెందిన నల్ల గణేష్ (50) వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. సంసారం విషయంలో ఈ నెల 19న భార్య బాలమణితో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన గణేష్ పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

మాసాయిపేట, సెప్టెంబరు 23 : మండల కేంద్రమైన మాసాయిపేటలో ఓ యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గౌటి వెంకటేశం (35) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఒంటరితనం భరించలేక ఆదివారం రాత్రి తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

26, 29 తేదీల్లో ఎస్జీఎఫ్ క్రీడా ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23 : సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న అండర్-19 బాలబాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు ఎంపికలు ఉంటాయని తెలిపారు. కొండాపూర్ మండలం పెద్దాపూర్‌లోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 29న హత్నూరలోని డా.బిఆర్.అంబేద్కర్ జూనియర్ కళాశాలలో చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 9 గంటల వరకు పదో తరగతి మెమో, కాలేజ్ బోనాఫైడ్, బర్త్ సర్టిఫికేట్, ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 8106841226, 9440686408 నంబరును సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే పేరున పేదల భూములు

- అధికారుల తప్పిదంతో రికార్డుల్లో మారిన పేర్లు
- న్యాయం చేయాలని కలెక్టర్‌కు బాధితుల మొర

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 : రెవెన్యూ అధికారుల అత్యుత్సాహంతో నిరుపేదలు అన్యాయం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే జిన్నారం మండలం అండూర్ గ్రామంలో సర్వే నంబర్ 378లో ఖమరున్నీసా, రఫక్ సుల్తానా, అక్తరున్నీసాలకు చెందిన 1.02 ఎకరాల భూమి ఉన్నది. కానీ రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ రికార్డుల్లో పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి పేరును నమోదు చేయడంతో వీరికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు రైతుభరోసా, రైతు రుణమాఫీని పొందలేకపోయారు. పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రాంమోన్‌రెడ్డికి ఈ గ్రామంలో కొంత భూమి ఉండగా గతంలో విక్రయించారు. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం అసలైన పట్టాదారుల పేర్లను తొలగించి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి పేరును నమోదు చేశారు. అంతేకాకుండా పేరు ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి ఉన్నా.. ఆధార్‌కార్డు మరొకరిది జత చేశారు. రెవెన్యూ అధికారుల తప్పిదంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని గ్రామ మాజీ సర్పంచ్ ఎండీ ఖాదర్‌ను కోరారు. దీంతో మాజీ సర్పంచ్ రెవెన్యూ అధికారులను అడిగినా స్పందించకపోవడంతో నేరుగా ఇదే విషయాన్ని పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డిని వద్దకు వెళ్లి అడగగా ఈ విషయంలో తన ప్రమేయమేమి లేదన్నారు. ఇదే విషయమై తిరిగి రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి అడగగా పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి కాగితంపై రాసి ఇస్తే చేస్తామని స్పష్టం చేశారు. దీంతో చేసేదేమీ లేక తమ సమస్యను కలెకర్‌కు వివరించినట్లు బాధితులు తెలిపారు.

రుణ వాయిదాలు చెల్లించలేదని దాడి

● పోలీసులు, అధికారులకు ఫిర్యాదు

తూప్రాన్, సెప్టెంబరు 23: మహిళా గ్రూపులో రుణం తీసుకుని వాయిదాలు చెల్లించడంలేదని కారణంతో ఒకరిపై దాడికి పాల్పడిన సంఘటన తూప్రాన్ మండలం వట్టూరులో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పాంబండ ప్రియాంక మహిళా గ్రూపులో రుణం తీసుకుంది. ఇంటి పరిస్థితులు సక్రమంగా లేకపోవడంతో మూడు నెలలుగా రుణ వాయిదాలు చెల్లించడంలేదు. దీంతో ఆదివారం రాత్రి రుణం చెల్లింపుల కోసం వీవోఏ (సీఏ) వెంగలి సంతోష్ ఇంటికి వచ్చి బూతులు తిడుతూ చీపురుతో దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు తెలిపింది. ఈ విషయమై తూప్రాన్ పోలీసులు, తూప్రాన్ ఆర్డీవో, ఎంపీడీవోలుకు కూడా ఫిర్యాదు చేసింది.



కొత్లాపూర్‌లో నీట మునిగిన పల్లె ప్రకృతివనం

నీట మునిగినా పట్టించుకోరా.?

- నీటితో నిండుకున్న కొత్లాపూర్ పల్లె ప్రకృతివనం, డంపు యార్డు
- నిర్లక్ష్యం వహిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 : గ్రామీణ ప్రాంతాల్లో పచ్చని వాతావరణం నెలకొల్పేందుకు గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతివనం, డంపు యార్డులను నిర్మించింది. సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో లేకపోవడంతో పోషమ్మకుంటలో పల్లె ప్రకృతివనం, డప్పు యార్డుని నిర్మించారు. పల్లె ప్రకృతివనంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించి గ్రామానికి పచ్చని వాతావరణం నెలకొల్పారు. అదే విధంగా డంపుయార్డుని నిర్మించి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సేకరించిన తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఎరువుని తయారు చేసేవారు. కానీ ఇటీవల కురిసిన వర్షాలకు పోషమ్మకుంటలో భారీగా నీరు చేరి పల్లె ప్రకృతి వనం, డంపుయార్డులు నీట మునిగిపోయాయి. దీంతో సేకరించిన చెత్తను వేరుచేయకుండా అంతా కలిపి ఒకేదగ్గర గ్రామంలో ఉండే బావిలో వేస్తున్నారు. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి వెంకట్‌ను ప్రశ్నించగా తాము పోషమ్మకుంటలో నీటిని తొలగించి దంపుయార్డుని వినియోగంలోకి తీసుకురావాలని ఇరిగేషన్ అధికారులకు రాతపూర్వకంగా విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పోషమ్మకుంటలో నీటిని తొలగించాలని తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నీటిలో మునిగిపోయిన డంపుయార్డు

ఎమర్జెన్సీని మించి రేవంత్‌రెడ్డి పాలన: మాజీ ఎమ్మెల్యే

హుస్నాబాద్, సెప్టెంబరు 23: ఇందిరమ్మ పాలన తెస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ఎమర్జెన్సీని మించి రాక్షస పాలన సాగిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య పరిస్థితులపై ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీసేందుకు గాంధీ ఆసుపత్రికి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను నిర్బంధంగా అరెస్టు చేసి తీసుకెళ్లిన తీరు అమానుషమన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి స్వగ్రామంలో ఆమె ఇంటిపై కాంగ్రెస్ వారు గుండాల వలే దాడులు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన కాదు గుండా రాజ్యం కొనసాగుతుందన్నారు. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

'హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి'

గజ్వేల్, సెప్టెంబరు 23: గజ్వేల్ పట్టణంలోని ఎస్టీ హాస్టల్‌తో పాటు జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అధికారులను కోరారు. సోమవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో భాగంగా వారి దృష్టికి తీసుకెళ్లారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలని, శిథిలావస్థలో ఉన్న హాస్టళ్లు, అద్దె భవనాల్లో నడుపుతున్న హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని కోరారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మిరుదొడ్డిలో క్రీడలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, సెప్టెంబరు 23: మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మిరుదొడ్డిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గ్రామ వాస్తవ్యుడు తోట కమలాకర్‌రెడ్డి సహకారంతో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) మండలస్థాయి క్రీడలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులకు సరైన విద్యార్హతలు ఉండవని, అలాంటి వాటిపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. విద్యార్థులు చదువతో పాటు క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విశ్రాంత పోలీస్‌శాఖ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మిరుదొడ్డి మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజును శాలువాతో సన్మానించారు. అలాగే మిరుదొడ్డి గ్రామంలో మురుగుకాలువలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎంఈవో ప్రభుదాస్, నాయకులు తుమ్మల బాల్‌రాజు, అంజిరెడ్డి, మద్దెల రాజేశం, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిరోధించాలి

దుబ్బాక, సెప్టెంబరు 23: ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను నిరోధించడం ద్వారా జీవకోటి మనగడకు నష్టం లేకుండా ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. దుబ్బాక మున్సిపల్ సముదాయంలో స్టీల్ బ్యాంకును ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గాన్ని ప్లాస్టిక్‌రహిత దుబ్బాకగా మార్చడానికి ప్రజలు సహకరించాలని. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు యాదగిరి, మీనా, స్వామి, సులోచన పాల్గొన్నారు.

నంగునూరులో ఎస్జీఎఫ్ క్రీడలు ప్రారంభం

నంగునూరు, సెప్టెంబరు 23: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి పాఠశాల క్రీడలను మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో దేశిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. నర్మెట్ట ఉన్నత పాఠశాలలో 23న వాలీబాల్, నంగునూరు ఉన్నత పాఠశాలలో 24న కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి సుధాకర్, గొట్టిపర్తి రామస్వామిగౌడ్, ఎం.రమేశ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనురాధ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

మిరుదొడ్డి, సెప్టెంబరు 23: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతిచెందిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మాజీ సర్పంచ్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. బాధిత రైతు తొంట అంజయ్య వ్యవసాయ పొలం వద్ద పాడిగేదెను కట్టేసి వచ్చాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదె విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందన్నారు. ఈ విషయాన్ని పశుసంవర్ధకశాఖ అధికారులకు తెలిపామని మాజీ సర్పంచ్ తెలిపారు. అలాగే అక్బర్‌పేట-భూంపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 85 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం/గజ్వేల్, సెప్టెంబరు 23: మద్యం తాగి వాహనాలు నడిపిన 85 మందికి జరిమానా విధించారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కొన్నిరోజుల నుంచి సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 72 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. సోమవారం వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపర్చగా విచారణ చేసి 72 మందికి రూ.87,500 జరిమానా విధించారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని ఆయా చౌరస్తాల్లో జరిపిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 13 మందిని సోమవారం కోర్టులో హాజరుపరచగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి తలా రూ.2 వేల చొప్పున రూ.26 వేల జరిమానా విధించినట్లు సీఐ మురళీ తెలిపారు.

ఆలయ అర్చక, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● ఆ సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు


మల్లన్న ఆలయ గెస్ట్‌హౌజ్‌లో జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడుతున్న పడిగన్నగారి ఆంజనేయులు

చేర్యాల, సెప్టెంబరు 23: ఆలయాల అర్చక, ఉద్యోగులు ఎదుర్కుంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కొమురవెల్లి మల్లన్న ఆలయ అర్చక, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు కోరారు. శనివారం మల్లన్న ఆలయ అర్చక, ఉద్యోగ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాదాయ శాఖ 6-ఏ పరిధిలోని యాదాద్రి, వేములవాడ, బాసర, కొండగట్టు, భద్రాచలం, కొమురవెల్లి ఆలయ అర్చక, ఉద్యోగులు పలు సమస్యలతో సతమతమవుతున్నార న్నారు. 888 జీవో సవరించాలని, పెన్షన్స్ ఫౌండ్ డిపాజిట్ చేయడం, ప్రభుత్వం తరఫున హెల్త్‌కార్డులు అందించాలని క్యాడర్ స్ట్రెంత్ రివైజ్ చేయాలని కోరారు. ఆయా అంశాల సాధన కోసం ఈనెల 25న వేములవాడలో జేఏసీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు నవీన, సంయుక్త కార్యదర్శి ఎం.భాస్కర్, కోశాధికారి ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

బాలల హక్కులపై అవగాహన

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 23: నారాయణరావుపేట మండలం మాల్యాలలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బాలల రక్షణ, సంరక్షణపై సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్‌వర్కర్ కనకరాజు మాట్లాడుతూ విద్యార్థులకు చైల్డ్ రైట్స్, పోక్సోయాక్ట్, సెల్ఫ్ అవేర్‌నెస్, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు.

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కోహెడ, సెప్టెంబరు 23: మండలంలోని నాగసముద్రాల ఆదర్శ పాఠశాల, కళాశాలలో గంటల ప్రాతిపదికన పని చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.నరసింహులు తెలిపారు. మోడల్ స్కూల్లో పీజీటీ బీఎంవో, టీజీటీ ఇంగ్లిష్ ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత గలవారు 25 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 26న ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'మిషన్ భగీరథ నీటిని సక్రమంగా అందివ్వాలి'

కొండపాక, సెప్టెంబరు 23: గ్రామాల్లో ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందివ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసచారి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొండపాకలోని ఐవోసీలో గ్రామపంచాయతీ మంచి నీటి సహాయకులకు శిక్షణా శిబిరాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భూపతి మాట్లాడారు. గ్రామ మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

●చేర్యాల: మంచినీటి సరఫరా పైప్‌లైన్, చేతిపంపులు, బోరుమోటార్ల మరమ్మతుల నిర్వహణతోపాటు మంచినీటి ల్యాబ్ పరీక్షలపై మండలంలోని ముస్త్యాల గ్రామ రైతువేదికలో మంచినీటి సహాయకులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిబిరాన్ని సంబంధిత అధికారులు సోమవారం ప్రారంభించి అవగాహన కల్పించారు.

శ్రీలంకలో దిసనాయకే గెలుపుపై హర్షం

గజ్వేల్, సెప్టెంబరు 23: శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో ఉత్కంఠగా సాగిన త్రిముఖ పోరులో మార్క్సిస్టు నేత అనుర కుమార దిసనాయకే విజయం సాధించడంపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి హర్షం వ్యక్తం చేశారు. గజ్వేల్ పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మిక కుటుంబంలో జన్మించిన ఆయన విద్యార్థి నేతగా మొదలై గత ఎన్నికల్లో కేవలం మూడు శాతం ఓట్లు సాధించి నేడు అధ్యక్షుడిగా గెలుపొందడం హర్షణీయమన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

దౌల్తాబాద్, సెప్టెంబరు 23: మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల గ్రామానికి చెందిన నర్సింహులు మార్కెట్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు (సీఈఐఆర్) అప్లికేషన్ ఉపయోగించి సెల్‌ఫోన్‌ను వెతికి పట్టుకున్నారు. అనంతరం ఇద్దరి సెల్ ఫోన్లను ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ ఆధ్వర్యంలో బాధితులకు అందజేశారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు అవసరం

● గజ్వేల్ వ్యవసాయాధికారి నాగరాజు


పత్తి పంట

గజ్వేల్, సెప్టెంబరు 23: ఈ ఏడాది వాతావరణ మార్పుల కారణంగా పత్తి పంట తీవ్ర ఒత్తిడికి గురవుతుంది. చాలాచోట్ల పంటకు చీడపీడలు ఆశించి రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా పురుగుల తాకిడి ఎక్కువగా ఉండటం వల్ల ఆకులు రంగు మారిపోయి, మొక్కలలో ఎదుగుదల లోపిస్తుంది. వానాకాలంలో వేసిన పత్తి పంటకు మొదట అనావృష్టితో ఇబ్బందులు పడగా, ఇటీవల 20 రోజుల పాటు ఏకధాటిగా కురిసిన వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది రుతుపవనాలు తొందరగానే వచ్చినా.. వర్షాలు ఆలస్యంగా రావడం.. వచ్చినా భారీగా కురవడం, మళ్లీ వర్షాలు లేకపోవడం వంటివి పంటల ఎదుగుదలకు, చీడపీడల తాకిడికి దోహదపడ్డాయి. ప్రస్తుతం పత్తి పంటకు తామర పురుగు, లద్దెపురుగు, పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక తాకిడి పెరిగింది. వీటిని గుర్తించిన వెంటనే సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి గుండు నాగరాజు సూచిస్తున్నారు.

నివారణ చర్యలు

●లద్దెపురుగు నివారణ: థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లేదా నొవాల్యూరాన్ 1మిల్లీ లీటర్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి

●తామర, లద్దె పురుగుల నివారణ: ఎకరాకు స్పైనోటరమ్ 180 మిల్లీ లీటర్ల మందును 200లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

●పచ్చదోమ, పేనుబంక నివారణ: ఎసిఫేట్+ఇమిడాక్లోప్రిడ్ (లాన్సర్) 2గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

●తెల్ల, పచ్చదోమ నివారణ: డైఫెన్థిరాన్ బైఫెన్‌త్రిన్ (టకాఫ్) 1.25మిల్లీ లీటర్ మందును పిచికారీ చేయాలి.

●పూత, గూడ నిలిచేందుకు: ఎకరాకు డీఏపీ 4 కిలోలు, ప్లానోఫిక్స్ 45మిల్లీ లీటర్ల మందును 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

లడ్డూను అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● గజ్వేల్ హైందవ సంఘాల ఐక్యవేదిక నాయకుల డిమాండ్


గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సైదాకు ఫిర్యాదు చేస్తున్న హైందవ సంఘాల నాయకులు

గజ్వేల్/చేర్యాల, సెప్టెంబరు 23: తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన వారికి కఠినంగా శిక్షించాలని గజ్వేల్ హైందవ సంఘాల ఐక్యవేదిక నాయకుల డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని హైందవ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని వెంకటేశ్వరాలయం నుంచి భారీ ర్యాలీగా అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని రోడ్డు బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సైదాకు ఫిర్యాదు చేసి మాట్లాడారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూను అపవిత్రం చేసిన వారిని వెంటనే గుర్తించి, శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరాలయ అధ్యక్షుడు బుక్క రమేష్, హైందవ సంఘాల నాయకులు దేశపతి రాజశేఖర్‌శర్మ, శేషం శ్రీనివాసాచార్యులు, నంగునూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయ లడ్డూ ప్రసాద తయారీకి జంతువుల కొవ్వుతో కూడిన కల్తీ నెయ్యి వినియోగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం రాత్రి చేర్యాల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఏపీ మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ ప్రకాశ్, తడక లక్ష్మణ్, అయిత సంపత్, శేరి బాలనారాయణ, ఉప్పల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోహెడ, సెప్టెంబరు 23: మండలంలోని రామచంద్రాపూర్ గ్రామ పరిధిలో మోయ తుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామచంద్రాపూర్‌లో హెడ్ కానిస్టేబుల్ డి.కొమురయ్య, కానిస్టేబుల్స్ రమేష్, ఎం.తిరుపతి పెట్రోలింగ్‌కు వెళ్లారు. ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్లు కావడంతో సదరు యజమానులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ప్రత్యక్ష సాక్షుల సమక్షంలో పంచనామా నిర్వహించి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హెడ్ కానిస్టేబుల్ కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్గల్‌లో వినాయక నిమజ్జనం

● రూ.3.31 లక్షలు పలికిన లడ్డూ


లడ్డూను అందజేస్తున్న ఏకదంతా యూత్

వర్గల్, సెప్టెంబరు 23: వర్గల్ మండల కేంద్రంలో ఏకదంతా యూత్ ఆధ్వర్యంలో గణేశ్ నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వినాయకుడి లడ్డూను వేలం పాటలో వర్గల్‌కు చెందిన ముక్త్యాల జహంగీర్‌గౌడ్ రూ.3.31 లక్షలకు దక్కించుకున్నారు. మరో లడ్డూను రూ.200 టోకెన్ విధానంలో డ్రా తీయడంతో నల్గొండ జిల్లాకు చెందిన దయాకర్‌రావు దక్కించుకున్నారు. ఈ నిమజ్జనంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

షోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీడీవో జనార్ధన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి

చిన్నకోడూరు, సెప్టెంబరు 23: షోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో జనార్ధన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం చిన్నకోడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో షోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించి, వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, సీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'మంత్రి శంకుస్థాపన చేసిన పనులు వెంటనే ప్రారంభించాలి'

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 23: హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసిన పనులు వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం హుస్నాబాద్-మహ్మదాపూర్ బైపాస్ రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. ఏడునెలల క్రితం రోడ్డు పనుల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారని, కానీ నేటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. దీంతో రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. .

అంకితభావంతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు: ఎంఈవో


సురేష్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో దేశిరెడ్డి, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు, సెప్టెంబరు 23: అంకితభావంతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చని ఇన్‌చార్జి ఎంఈవో దేశిరెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వైవి.సురేష్‌కుమార్‌కు సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, ఉపాధ్యాయులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో సన్మానకార్యక్రమం నిర్వహించారు. అనంతరం సురేష్‌కుమార్ దంపతులను శాలువా, మెమెంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో భాస్కర్, ఎంఎస్‌వో తిరుపతి, కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మయ్య, హైస్కూల్ హెచ్‌ఎం సత్యవతి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి: ఆనంద్‌గౌడ్

చేర్యాల, సెప్టెంబరు 23: బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతంగా పూర్తి చేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమాల ఆనంద్‌గౌడ్ అన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గీత కార్మికుల కుటుంబాలకు సభ్యత్వం అందించడంతో పాటు రాజకీయ రంగాల్లో రాణింపజేసేందుకు చొరవ వహించాలని సూచించారు.

విద్యార్థులు క్రమశిక్షణగా ఉంటేనే భవిష్యత్


విద్యార్థులకు ఐడీకార్డులు, డైరీలు పంపిణీ చేస్తున్న మాజీ జడ్పీటీసీ మంగమ్మరామచంద్రం

మర్కుక్, సెప్టెంబరు 23: విద్యార్థులు క్రమశిక్షణగా ఉంటేనే భవిష్యత్ అని మాజీ జడ్పీటీసీ మంగమ్మరామచంద్రం సూచించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశానికి ఆమె హాజరయ్యారు. మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి, దాత మాజీ ఎంపీటీసీ నరేందర్ బహూకరించిన డైరీలను ఆవిష్కరించారు. అదేవిధంగా మంగమ్మరామచంద్రం విద్యార్థులకు టై, బెల్టు, బ్యాచ్ ఐడీకార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మెన్ కనకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్దుబాటు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

● పీఆర్టీయూ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు

మర్కుక్, సెప్టెంబరు 23: ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీచేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని పీఆర్టీయూ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీచేసిన మార్గదర్శకాలు ప్రాథమిక పాఠశాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి స్పష్టమవుతుందన్నారు. ప్రాథమిక పాఠశాలలకు సంఖ్యతో సంబంధం లేకుండా 50లోపు విద్యార్థులు ఉన్న స్కూల్స్‌కు ముగ్గురు ఉపాధ్యాయులను, 50 నుంచి 100 వరకు ఉన్న స్కూల్స్‌కు ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయిస్తూ.. ప్రతి పాఠశాలకు ఒక హెచ్‌ఎం పోస్టును మంజూరు చేయాలన్నారు.

బుగ్గ రాజేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు


హుండీని లెక్కిస్తున్న భక్తులు

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 23; నారాయణరావుపేట మండల కేంద్రంలోని బుగ్గరాజేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపును సోమవారం నిర్వహించినట్లు దేవాదాయశాఖ ఈవో విశ్వనాథశర్మ తెలిపారు. ఆరునెలల హుండీ ఆదాయం రూ.1,80,534లు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కిషన్, ప్రధాన అర్చకుడు సీతారామశర్మ, రాజరాజేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'దేవాదాయ భూమిని ధరణిలో నమోదు చేయాలి'

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 23: జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామంలో తిరుమలాయ ఆలయ భూములను కాపాడి, ధరణిలో నమోదు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన ఆలయ ట్రస్ట్ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని 266, 267 సర్వే నంబర్లలో ఉన్న 15 ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణమూర్తి, నర్సమ్మ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో చరణికి ప్రథమస్థానం


చరణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 23: వికాస తరంగిణి, ట్రస్మా సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న ముచ్చింతల్‌లోని చినజీయర్‌స్వామి ఆధ్యాత్మిక కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో హుస్నాబాద్ పట్టణంలోని సీవీ రామన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన కాంసాని చరణి ప్రథమస్థానం దక్కించుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సోమవారం హైస్కూల్‌లో చరణికి ప్రిన్సిపాల్ కాయిత నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. చినజీయర్‌స్వామి ఆశ్రమంలో స్వాతంత్ర్య సమరయోధులకు కృతజ్ఞత తెలిపే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చరణి ప్రథమస్థానం దక్కించుకుని, రూ.3 వేల నగదు పురస్కారాన్ని చినజీయర్‌స్వామి చేతులమీదుగా అందుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

● సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య


చేర్యాలలో మునిసిపల్ కార్మికులతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

గజ్వేల్, సెప్టెంబరు 23: కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, 12 గంటల పని విధానం అమలు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్, మల్లయ్య స్వామి, వెంకటేష్, రంగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

●చేర్యాల: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేర్యాలలో సీఐటీయూ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాళ్లబండి భాస్కర్, కనకవ్వ పాల్గొన్నారు.

●దుబ్బాక: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంసహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాకలో సీఐటీయూ కార్యాలయంలో కార్మికులతో కలిసి లేబర్ కోడ్లను రద్దుచేయాలని ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఆయన వెంట సీఐటీయూ నాయకులు, కార్మికులు ఉన్నారు.

మానవాళి మనుగడకు చెట్లు దోహదం



గజ్వేల్‌లో మొక్కలను నాటుతున్న మునిసిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, సెప్టెంబరు 23: మానవాళి మనుగడకు చెట్లు దోహదపడతాయని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన మొక్కలను నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటడంతో పాటు సంరక్షించాలన్నారు. ఆయనవెంట వైస్ చైర్మన్ జకీయోద్దీన్, మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య, కౌన్సిలర్లు మెట్టయ్య, బబ్బూరి రజిత ఉన్నారు.

●సిద్దిపేట కల్చరల్: మొక్కలను నాటిన తర్వాత వాటి బాధ్యత కూడా తీసుకోవాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా సోమవారం సిద్దిపేట కేంద్రీయ విద్యాలయ ఆవరణలో విద్యార్థులతో కలిసి సుమారు 450 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కేంద్రీయ విద్యాలయ అధ్యాపకులు పాల్గొన్నారు.

●చేర్యాల: తడి, పొడి చెత్తను వేరుచేయడం పట్ల చేర్యాల పట్టణ ప్రజలకు మునిసిపల్ అధికారులు అవగాహన కల్పించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయ వీధిలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, కమిషనర్ నాగేందర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

●హుస్నాబాద్: హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత కలిసి పోలీసులు స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు.

'తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి'

హుస్నాబాద్, సెప్టెంబరు 23: తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో హుస్నాబాద్ రెవెన్యూ డీఏవోకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమంలో కేసులై జైలుకు వెళ్లిన ఉద్యమకారులను గుర్తించి ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరారు. అలాగే హెల్త్‌కార్డులు, రూ.25 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ కుమారస్వామి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు ఉన్నారు.